ప్రజాశక్తి
గురువారం 8 జూన్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆశలు ఆవిరి

- ఐదేళ్ల సర్వీసు నిబంధనతో వడపోత
- అర్హత కోల్పోతున్న 50శాతంపైగా ఉద్యోగులు, అధ్యాపకులు

ప్రజాశక్తి-గుంటూరు

కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై ప్రభుత్వం విధించిన నిబంధన వల్ల కొందరు కాంట్రాక్ట్ ఉద్యోగుల్లో తీవ్ర నిరాశ వ్యక్తమవుతోంది. దాదాపు సగం మంది క్రమబద్ధీకరణ అర్హత కోల్పోతున్నారు. అన్ని అర్హతలతో, ఒకే జీతంతో, ఒకేశాఖలో పనిచేస్తున్న కొందరు రెగ్యులర్ అవుతుండగా, కొందరు అవకాశం కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీకి భిన్నంగా వడపోత కార్యక్రమం చేపడుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అర్హత మేరకు సాధ్యమైనంత ఎక్కువ మందికి రెగ్యులర్ చేస్తామని ఎన్నికలప్పుడు హామీ ఇచ్చిన

▶ 2లో

2014 నాటికి విధుల్లో ఉన్న అందర్నీ క్రమబద్ధీకరించాలి

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు విధించిన ఐదేళ్ల సర్వీసు నిబంధన సరికాదు. దీని వల్ల అందరికీ న్యాయం జరగదు. తెలంగాణలో మాదిరిగా రాష్ట్ర విభజన నాటికి సర్వీసులో ఉన్న ఉద్యోగులు అందర్నీ క్రమబద్ధీకరణ చేయాలి.

ఎన్నో ఆశలు పెట్టుకున్నాం

కె.రత్నకుమారి, ప్రభుత్వ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం

ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అందర్నీ క్రమబద్ధీకరిస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. కానీ ఐదేళ్ల సర్వీసు నిబంధన వల్ల కొద్దిపాటి వ్యత్యాసంతో క్రమబద్ధీకరణకు దూరవుతున్నాం. దాదాపు 14 ఏళ్ల సర్వీసున్నా ఉద్యోగ భద్రత లేక, దినదిన గండంగా జీవిస్తున్నాం.

సరైన ప్రాతిపదిక లేదు

ఆర్.స్వాతి, పాలిటెక్నిక్ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం

ప్రభుత్వం ఐదేళ్ల సర్వీసు నిబంధనకు ప్రాతిపదికేమీ లేదు. కేవలం అర్హులను కుదించటానికే ఈ నిబంధన విధించినట్లుగా తెలుస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చుకుంటుందని ఇప్పటి దాకా ఎన్నో ఆశలతో ఉన్న ఉద్యోగుల తీవ్ర నిరాశలో ఉన్నారు. మిగిలిన వారిని క్రమబద్ధీకరించే విషయం కూడా స్పష్టతివ్వాలి.

కృష్ణా పశ్చిమ డెల్టాకు సాగు, తాగునీరు

- విడుదల చేసిన జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ఖరీఫ్ సాగు ప్రారంభించాలని రైతులకు సూచన

ప్రజాశక్తి-గుంటూరు, తాడేపల్లి

కృష్ణా పశ్చిమ డెల్టా కాలువ పరిధిలోని ఆయకట్టు సాగునీటికి, ప్రజల త్రాగునీటి అవసరాల కోసం 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బుధవారం తాడేపల్లిలోని కృష్ణా బ్యారేజి, హెడ్ రెగ్యులేటర్ నుంచి రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు, మంగళగిరి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి నీటిని విడుదల చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో జూన్ నెల చివరిలోగానీ, జులై ప్రారంభంలోగానీ నీరు విడుదల చేసే వారని, కానీ గతేడాది నుంచి జూన్ ప్రారంభంలోనే నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. దీని వల్ల

▶ 2లో

నేడు పల్నాడు జిల్లాకు కౌలురైతు సంఘం రాష్ట్ర జాతా

2 లో

అనుమానం పెనుభూతమై హత్య

భార్యను హతమార్చి ఆపై ఆత్మహత్యాయత్నం

వినుకొండలో జాతాబృందంతో కలిసి నినాదాలు చేస్తున్న మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు

ప్రభుత్వం స్పందించకుంటే సమ్మె

- మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం
- పల్నాడు జిల్లాలో రాష్ట్ర వ్యాప్త జీపుజాతా పర్యటన
- పలు మున్సిపాల్టీల్లో ఘన స్వాగతం, బృందానికి వినతులు

ప్రజాశక్తి - నరసరావుపేట

మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులందర్నీ పర్మినెంట్ చేయాలని, మున్సిపల్ ఉద్యోగులకు సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశాలపై గత నెల 31వ తేదీన సత్యసాయి జిల్లా హిందూపురం నుండి ప్రారంభమైన రాష్ట్ర స్థాయి మున్సిపల్ ప్రచార జాతా బుధవారం పల్నాడు జిల్లాలో పర్యటించింది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రమైన నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేటలలో

▶ 2లో

రెండు గంటలు గందరగోళం

వినుకొండలో ఈదురుగాలులు, వర్షం.
రోడ్డుకి ఇరువైపులా కూలిన భారీ చెట్లు
స్తంభించిన వాహన రాకపోకలు
విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - వినుకొండ

ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం బుధవారం సాయంత్రం వినుకొండలో గందరగోళం సృష్టించాయి. స్థానిక కారంపూడి రోడ్డులోని కళ్యాణపురి కాలనీ సమీపంలో దాదాపు 10 వరకు భారీ చెట్లు నేలకూలి రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో వాహన రాకపోకలు స్తంభించాయి. చెక్క వాగు వద్ద నుండి కరెంట్ ఆఫీస్ వరకు భారీ చెట్లు పడిపోయాయి. వీటిని తొలగించే వీలులేక, అధికారులు స్పందించక కొన్ని గంటలపాటు రోడ్డుకిరువైపులా కిలోమీటర్ల దూరంపాలు నిలిచాయి. ఆరు గంటల నుండి రాత్రి 7 గంటల వరకూ ఇదే పరిస్థితి నెలకొంది. పలు విద్యుత్ స్తంభాలు సైతం నేలకొరిగి పట్టణంలో 9.30 గంటల వరకూ సరఫరా నిలిచింది.

గుంటూరు ఛానల్‌ను పరిశీలిస్తున్న వి.శ్రీనివాసరావు, పాశం రామారావు తదితరులు

తాగునీటి నుండి వ్యవసాయం దాక

- సమస్యలను ఏకరువు పెట్టిన కాజా గ్రామస్తులు
- గ్రామంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఇతర నాయకుల పరిశీలన
- గుంటూరు ఛానల్‌లో తూటికాడ తొలగింపునకు డిమాండ్
- సమస్యలపై పోరాటంలో కలిసి రావాలని పిలుపు

2 లో

తాగునీటి నుండి వ్యవసాయం దాక

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

గుంటూరు ఛానల్లో పేరుకుపోయిన తూటికాడను వెంటనే తొలగించి సమస్యని పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. సమస్యల అధ్యయనంలో భాగంగా మండలంలోని కాజలో సిపిఎం బృందం మంగళవారం పర్యటించి పరిశీలించడంలోపాటు స్థానికులతో మాట్లాడారు.

పలువురు రైతులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను నాయకుల దృష్టికి తెచ్చారు. గుంటూరు ఛానల్ తూటికాడ విపరితంగా పెరిగి నీటిపారుదల తగ్గిందని, నీరు ముగురుగా మారడం, వాటిని ట్యాంకులకు తరలించి కుళాయిలకు సరఫరా చేయడంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారని చెప్పారు. దురదలు, దద్దుర్లతో ఇబ్బందులు పడుతున్నామని మరికొందరన్నారు. ఇళ్లపట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, రైతు భరోసా కేంద్రం నిరుపయోగంగా ఉందని చెప్పారు. పంటకు మద్దతు ధర దక్కడం లేదన్నారు. డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందని, అధికారులకు విన్నవిద్దామని వెళితే తమ పరిధిలోది కాదంటూ, కార్పొరేషన్లో విలీనమైందంటూ చెబుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. తాగునీటి

కాజ గ్రామస్తులతో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, తదితరులు

సమస్య తీవ్రంగా ఉందని, అరకొరగానే సరఫరా చేస్తున్నారని వాపోయారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారులు వెంటనే స్పందించి తూటికాడను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇతర సమస్యల పరిష్కారం కోసం రానున్న రోజుల్లో సిపిఎం చేపట్టే పోరాటాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, నాయకులు బి.కోటేశ్వరి, టి.ప్రసాదరెడ్డి, ఎ.సాంబిరెడ్డి, మాజీ ఎంపిటిసి ఇ.ప్రతాపరెడ్డి, ఎస్.సుమ, శివయ్య, నరసింహారావు, ఆది శేఖర్, సత్యమారెడ్డి, ఎస్.లక్ష్మారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

కృష్ణా పశ్చిమ డెల్టాకు సాగు, తాగునీరు

(మొదటి పేజీ తరువాయి)

త్వరగా ఖరీఫ్ సీజన్ ప్రారంభించటానికి, రైతులు మూడు పంటలు పండించటానికి అవకాశం దక్కుతుందని అన్నారు. ముందుగానే పంటలు పండించుకోవటం వల్ల గాలులు, వానలు, తుపానులు సంభవించడానికి ముందే పంటలు ఇళ్లకు చేర్చుకోవడం జరుగుతుందన్నారు. కష్ణా బ్యారేజీలో 3 టీయంసీల నీరు నిల్వ వుందని, పులిచింతల ప్రాజెక్టులో 34 టీయంసీల నీరు పుష్కలంగా వుందని చెప్పారు. కష్ణా డెల్టాకు కావాల్సిన నీరు సమద్ధిగా వుండడం వలన పట్టిసీమ నుండి నీటిని తీసుకురావలసిన అవసరం రాలేదని, అందువల్ల రైతులు త్వరగా నారుమడులు వేసుకొని పంటలు పండించాలని కోరారు. గతేడాది పంటలు ముందుగా పండించడం వల్ల రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. నాగార్జున సాగర్ నుండి నీటిని విడుదల చేయకుండానే పులిచింతల ప్రాజెక్టులో వున్న నీటినే వాడుకోవచ్చన్నారు. అవసరమైన పక్షంలో నాగార్జున సాగర్ నుండి కూడా నీరు విడుదలకు అవకాశం వుందని భావిస్తున్నట్లు తెలిపారు. హనుమంతరావు మాట్లాడుతూ కృష్ణా పశ్చిమ డెల్టా కాల్వకు సాగు, తాగు నీటి అవసరాలకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని, అవసరాన్ని బట్టి నీటి విడుదల పెంచడానికి అవకాశం వుందని తెలిపారు.

అనుమానం పెనుభూతమై హత్యకు..

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మృతురాలు అరుణ (ఫైల్)

యువ జంట మధ్య అనుమానం అనే చిచ్చు యువతి ప్రాణాలను బలిగొంది. పెళ్లయిన మూడేళ్లకే భర్త చేతిలో హత్యకు గురవడంతో అభంశుభం తెలియని ఏడాదిన్నర పాప తల్లికి దూరమైంది. సత్తెనపల్లి పట్టణంలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఘటనపై వివరాల ప్రకారం.. పట్టణం సమీపంలోని భీమవరం గ్రామానికి చెందిన పల్లపు కోటేశ్వరమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు కాగా భర్త గతంలోనే చనిపోయాడు. ఈ నేపథ్యంలో కోటేశ్వరమ్మ తన ఇద్దరు కుమార్తెలను చదివించే ఆర్థిక స్తోమత లేక కూలి పనులకు పంపుతోంది. ఆమెకూడా పట్టణంలోని ఓ హోటల్లో పనికి వెళ్తున్నారు. తన పెద్ద కుమార్తె అరుణ (18) మూడేళ్ల కిందట పట్టణంలోని రంగా కాలనీకి చెందిన ఒంటిపులి కార్తీక్ను ఇచ్చి పెళ్లి చేశారు. వీరికి ఏడాదిన్నర కుమార్తె ఉంది. భవన నిర్మాణ పనులు చేసుకునే కార్తిక్ తరచూ హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు పనుల కోసం వెళ్తుంటాడు. అరుణ సైతం కూలి పనులకు వెళ్తుంటుంది. ఈ క్రమంలో వీరు అరుణ పుట్టింట్లోనే ఉంటూ ఉంటారు. అయితే అరుణపై కార్తిక్ అనుమానం పెంచుకోవడతో కొన్ని నెలలుగా వారిమధ్య తరచూ వివాదాలు వస్తున్నాయి. ఈ క్రమంలో ఐదు రోజుల కిందట వీరు రంగా కాలనీలోని ఒ ఇంట్లోకి అద్దెకు మారారు. ఆ తర్వాత మూడ్రోజులకే మళ్లీ గొడవలు మొదలయ్యాయి. మంగళవారం రాత్రి కూడా గొడవపడ్డారు. మద్యం సేవించి వచ్చిన కార్తీక్ బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు అరుణను గొంతు నులిమి హత్యచేశాడు. అనంతరం తానూ ఎలుకల మందు తిన్నాడు. సమీపంలోని అరుణ బంధువులు ఇది గమనించి కార్తిక్ కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. కార్తిక్ను తొలుత స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు తరలించారు. సమాచారం తెలిసిన పట్టణ సిఐ యు.శోభన్బాబు, తహశీల్దార్ కె.నగేష్ ఘటనా స్థలిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి తల్లి కోటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వం స్పందించకుంటే సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

యాత్ర సాగగా అనంతరం బాపట్ల జిల్లాలోకి ప్రవేశించింది. ఇందులో భాగంగా నరసరావుపేటలోని వినుకొండ ఆర్టీసి బస్టాండ్ వద్ద జాతాకు కార్మికులు, ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. మున్సిపల్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం వద్ద బహిరంగ సభకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ అధ్యక్షత వహించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు పాదయాత్రలో జగన్మోహన్రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగుల్ని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఆప్కాస్ విధానాన్ని రద్దుచేసి కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింప జేయాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రస్తుతం ఇస్తున్న రూ.6 వేలు హెల్త్ అలవెన్సును జీతంతో కలపాలన్నారు. ఇంజినీరింగ్ విభాగం కార్మికులకు వారాంతపు, పండగ సెలవులు, స్కిల్డ్, సెమీస్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్లాప్ డ్రైవర్లకు రూ.18500 వేలు ఇవ్వాల్సి ఉండగా రూ.10 వేలే ఇస్తున్నారని, వారిని మున్సిపల్ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే దశలవారీ పోరాటానికి, అవసరమైతే సమ్మెకు వెళతామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా పిడుగురాళ్ల, మాచర్ల, నరసరావుపేట మున్సిపల్ కార్మికులు తమ సమస్యలపై వినతిపత్రాలను యూనియన్ రాష్ట్ర అధ్యక్షునికి అందించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, కోశాధికారి డి.శివకుమారి, ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్, నాయకులు జి.మల్లేశ్వరి, టి.శ్రీనివాసరావు, హుస్సేన్వలి, మల్లయ్య, సాల్మన్, ఏసు, శ్రీను, జె.కృపారావు, వీరకుమార్, ప్రసాద్, నవీన్, నరసింహారావు, చిన్నఅల్లాబక్షు, వెంకటేష్, హుస్సేన్, రమణ, మార్తమ్మ, విజయలక్ష్మి, సీతారామయ్య, రామారావు, పద్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

మున్సిపల్ కార్మికుల రాష్ట్ర ప్రచార జాత పట్టణానికి చేరుకోకగా కార్మికులు ఘన స్వాగతం పలికారు. మున్సిపల్ కార్యాలయం వద్ద బహిరంగ సభలో రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం మాట్లాడారు. మునిసిపల్ ఉద్యోగుల్లో 90 శాతం తళితులేనని, మిగతావారూ బలహీన వర్గాల మహిళలేనని చెప్పారు. వీరందరికీ 010 పద్దు ద్వారా జీతాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, నాయకులు ఎ.ఆంజనేయులు,

చిలకలూరిపేటలో మాట్లాడుతున్న జాతా నాయకులు

బి.వెంకటేశ్వరరావు, నాసర్బి, నవీన్, మహేందర్రెడ్డి, శ్రీను, వలి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

నరసరావుపేట నుండి చిలకలూరిపేట పట్టణానికి చేరిన జాతాకు మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సభలో నాగభూషణం మాట్లాడారు. జాతా 9వ తేదీన విజయవాడుకు చేరుకుంటుందని చెప్పారు. ఈ సందర్భంగా కార్మికులు తమ సమస్యలపై జాతాకు వినతిపత్రం ఇచ్చారు. వాటర్ ట్రాక్టర్ డ్రైవర్గా 24 ఏళ్లుగా పని చేస్తున్న తనకు మేనెల జీతం ఆపేశారని, కారణం కూడా చెప్పలేదని కరిముల్లా వాపోయాడు. దీంతోపాటు మరో 10 సమస్యలపై విన్నవించారు. నాగరాజు, ఎన్.లక్ష్మీనారాయణ, బి.గోపి, ఆదినారాయణ, కృష్ణవేణి, పుల్లయ్య, రామాంజనేయులు, కె.హనుమంతరెడ్డి ఎం.విల్సన్, ఎస్.లూథర్, కె.రోశయ్య, పి.రాజు, టి.మల్లయ్య పాల్గొన్నారు.

నేడు పల్నాడు జిల్లాకు కౌలురైతు సంఘం రాష్ట్ర జాతా

ప్రజాశక్తి - నరసరావుపేట : కౌలు రైతుల చట్టం -2019ని సవరించాలని కోరుతూ, కౌలురైతుల సమస్యల పరిష్కారం కోసం నెల్లూరు జిల్లా నుండి వస్తున్న రాష్ట్ర జాతా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు గురువారం చేరుతుందని సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రామారావు, వై.రాధాకృష్ణ బుధవారం ఒ ప్రకటనలో తెలిపారు. జాతా బుధవారం చిలకలూరిపేట మండలం ఏలూరుకు చేరుకొని శుక్రవారం ఉదయం చిలకలూరిపేట పట్టణం మీదుగా యడవల్లి, కోటప్పకొండ, గురవాయపాలెం, యలమంద, గ్రామాల ద్వారా ఉదయం 10 గంటలకు నరసరావుపేటకు చేరుతుందని తెలిపారు. స్థానిక ఆర్టిసి బస్టాండ్ వద్ద బహిరంగ సభ ఉంటుందని, అన్ని ప్రాంతాల్లో యాత్రకు ఘన స్వాగతం పలకాలని, నరసరావుపేట బహిరం గ సభను జయప్రదం చేయాలని కౌలురైతులకు పిలుపునిచ్చారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆశలు ఆవిరి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం 2014 జూన్ 2, రాష్ట్ర విభజన నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారి సర్వీసులనే క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వం ఇప్పుడు ప్రకటించటంపై ఆశావహులు మండిపడుతున్నారు. ఐదేళ్ల సర్వీసుకు ఒకటి రెండేళ్లు, నెల రోజుల వ్యత్యాసంతో కూడా క్రమబద్ధీకరణకు దగ్గరగా వచ్చి అందకుండా పోతుందని ఆందోళన చెందుతున్నారు.

ముఖ్యంగా ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్ పనిచేస్తున్న అధ్యాపకులు, ఇతర శాఖల్లో పనిచేస్తున్న వారు సగం మంది క్రమబద్ధీకరణకు దూరం అవుతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో దాదాపు 4వేల మంది అధ్యాపకులు ఉండగా, ఉమ్మడి జిల్లాలో సుమారు 150 మంది ఉంటారు. మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్లో జిల్లాల్లో ఏఎన్ఎంలు ఇతర ఉద్యోగులు సుమారు 400 మంది ఉన్నారు. వీరిలో ప్రభుత్వ నిర్ణయం వల్ల ప్రస్తుతం సగం మందే క్రమబద్ధీకరణ అవుతారని ఉద్యోగులు అంచనా వేస్తున్నారు.

2009 తర్వాత నియామకం పొందిన వారు క్రమబద్ధీకరణకు అవకాశం లేదు. రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల్లో 2001 నుంచి 2014 వరకూ కాంట్రాక్ట్ ఉద్యోగుల నియామకాలు జరిగాయి. వీరిలో దాదాపు సగం మందికిపైగా 2008, 2009, ఆ తర్వాత సంవత్సరాల్లో నియమాకం పొందిన వారున్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం 2009 జూన్ 2 తర్వాత నియామకం పొందిన వారికి క్రమబద్ధీకరణ అర్హత లేదు. ఇదిలా ఉంటే తెలంగాణ రాష్ట్రంలో 2014 జూన్ 2 నాటికి విధుల్లో ఉన్న వారిని క్రమబద్ధీకరణ చేయటంతో ఎక్కువ మంది లబ్ధి పొందారు. అందుకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్లో నిబంధనలు విధిస్తున్నారని, తెలంగాణలో మాదిరిగా ఎపిలోనూ అందరికీ లబ్ధి చేకూరే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఒకే శాఖలో పనిచేస్తూ కొందర్ని రెగ్యులర్ చేస్తూ, కొందర్ని చేయకపోవటం వల్ల వారి మధ్య మనస్పర్ధలు వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయి. దశల వారీగా రెగ్యులర్ చేయాలని భావిస్తున్నా.. మిగిలిన వారిని ఎప్పుడు క్రమబద్ధీకరిస్తారనే విషయంలో స్పష్టత లేదు. దీనిపై అధ్యాపకులు, ఉద్యోగులు ఆందోళనలకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

పత్తి వి(ప)త్తు కొనుగోలులో జాగ్రత్త..

- లూజు, నకిలీ,నిషేధిత పత్తి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు
- రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఐ. మురళి

ప్రజాశక్తి - నరసరావుపేట

జూన్ మొదటి వారం నుంచి ఖరీఫ్ సాగులో పత్తి విత్తు విత్తేందుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. జూన్ నెలలో విత్తుకుంటే ప్రయోజనకరంగా ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రతి ఏటా ఏప్రిల్ మే నెలలో పత్తి వేసిన రైతులు కొంత మేర నష్ట పోవడాన్ని గమనించిన వ్యవసాయ శాఖ అధికారులు ఏప్రిల్ మే నెలల్లో పత్తి విత్తనాల విక్రయాలపై నిషేధం విధించారు. ప్రస్తుతం పత్తి విత్తనం కొనుగోలుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ పరిస్థితి దష్టిలో పెట్టుకొని కొంత మంది వ్యాపారులు అనుమతులు లేని నకిలీ విత్తనాలను మార్కెట్లోకి తెస్తున్నారు. కొన్ని మండలాలలో చాప కింద నీరుగా లూజు పత్తి విత్తనాలు అమ్మకాలు జోరుగా సాగుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాణ్యమైన విత్తనాలు కోసం ఎకరాకు వేలల్లో ఖర్చు పెట్టలేని రైతులు లూజు నకిలీ విత్తన వ్యాపారుల మాటలు నమ్మి సాగు చేపట్టి నష్టపోతున్నారు.

డిమాండ్ ఉన్న విత్తనాలను అధిక ధరకు విక్రయాలు

నరసరావుపేట పట్టణ సమీపం నుండి చుట్టుపక్కల గ్రామాలలో దాదాపుగా అన్ని గ్రామాలలో ఒక మోస్తరుగానే పత్తి సాగు వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. గత ఏడాది దిగుబడులు ఆశాజనకంగా లేకపోయినా తెగుళ్ల చీడపీడలు ఉధతి కొంచెం తక్కువ ఉన్న పత్తి పంట సాగుకు రైతులు చూస్తున్నారు. ఎకరాకు 3 ప్యాకెట్లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఒక ఎకరాకు విత్తన ఖర్చు రూ 3 వేలు నుండి రూ 4 వేలు వరకు అవుతుంది. 10లేదా 20 అంతకంటే ఎక్కువ మొత్తం ఎకరాలలో సాగు చేపట్టే రైతులు తక్కువ ధరకు వస్తున్నాయి కదా అని వాటి వైపు మొగ్గుచూపుతున్నారు. విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేసినా దిగుబడులు రాక పూర్తిగా నష్టపోతున్నారు.లూజు విత్తనాలకు ఎటువంటి రసీదు లేకపోవడంతో నష్ట పరిహారం పొందే వీలు ఉండదు. కొందరు వ్యాపారులు ప్రముఖ కంపెనీల తరహాలో ఆకర్షణీయమైన రంగు రంగుల ప్లాస్టిక్ కవర్లలో పత్తి విత్తనాలు నింపి రైతులకు అంటగడుతున్నారు.

విత్తన దుకాణదారులు నిబంధనలు పాటించాలి

పట్టణంలో లేదా గ్రామాలలో ఉన్న విత్తన దుకాణాలలో కానీ దుకాణ దారులు పలు గ్రామాలలో నిల్వలు

ఉంచి లూజు, నకిలీ,నిషేదిత పత్తి విత్తనాలు అమ్మితే విత్తన డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ. మురళి అన్నారు. గురువారం ప్రజాశక్తితో ఆయన ప్రత్యేకంగా మాట్లాడుతూ ఖరీఫ్ ప్రారంభంలో రైతులు ఒక మోస్తరు గానే ప్రత్తి సాగు వైపు మొగ్గ చూపుతున్నారని అనుమతులు లేని మరియు కల్తీ విత్తనాలు రైతులు కొనుగోలు చేసి మోసపోరాదని సూచించారు. విత్తన దుకాణాలపై ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తామని తనిఖీల సమయంలో నిబంధనలు పాటించని డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. విత్తనాలు అమ్మిన డీలర్లు వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా అనుమతులు పొందిన బిల్లు పుస్తకాల ద్వారా మాత్రమే బిల్లులు రైతులకు కొనుగోళ్ళకు సంబంధించి ఇవ్వాలన్నారు. కొటేషన్ పుస్తకాలను బిల్లుగా ఇవ్వడం చట్ట ప్రకారం నేరమన్నారు.

విత్తన ముద్రణ ధర,తేది,కాలం చెల్లనున్న ధర , లాట్ నెంబర్ తదితర వివరాలను తప్పని సరిగా బిల్లులో పొందుపరచిన తర్వాత రైతుకు రసీదు ఇవ్వాలన్నారు. పత్తి, మిరప విత్తనాలు నిర్ణయించిన ధరకు మించి ఎక్కువ ధరకు విక్రయిస్తే డీలర్ పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విత్తనాలు ఎరువులు రసాయనిక పురుగు మందులకు సంబంధించి విడివిడిగా బిల్లు బుక్కులు స్టాక్ రిజిస్టర్లు పెట్టాలని సూచించారు. ఆయా నిల్వల వివరాలు ధరలు పట్టిక దుకాణంలో బోర్డుపై తప్ప క పొందుపరచాలని నిల్వలు బోర్డుకు రిజిస్టర్ కు పొంతన లేకపోయినా ఆ నిల్వల విక్రయాలు నిలుపుదల చేస్తా మన్నారు. ఈ ఖరీఫ్ సాగుకు సంబంధించి ప్రతి రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవసరమైన ఎరువులు, విత్త నాలు, పురుగు మందులు,సూక్ష్మ దాతువులు, జిప్సం కొరత లేకుండా అందుబాటులో ఉంచడం జరుగుతుం దన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు పంట కాలం ముగిసే వరకు విత్తనాల సంచి బిల్లు భద్రపరచాలన్నారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు సూచనలు తప్పక పాటించి సాగులో మెళుకువలు తెలుసుకోవా లన్నారు.

50 శాతం రాయితీపై ధాన్యం సాధారణ రాయితీపై మిర్చి, పత్తి విత్తనాల సరఫరా

19.40 లక్షల ప్యాకెట్ల మిర్చి విత్తనాలు 6.60 లక్షల పత్తి విత్తనాలు ఏపీ సీడ్స్ ద్వారా 45 నుండి 50 వేల హెక్టార్లకు సరిపడా ధాన్యం విత్తనాల సరఫరాకు నివేదికలు పంపించడం జరిగిందన్నారు. పచ్చి రొట్ట విత్తనాలు ఆర్.బి.కె లలో అందుబాటులో ఉన్నాయని రైతులు పచ్చి రొట్ట విత్తనాలు సాగు చేసి భూమిలో సూక్ష్మ సేంద్రియ ఎరువుల విస్తరణకు కృషి చేయాలన్నారు.

ఎరువుల కొరత ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు....

గత ఏడాది రైతు భరోసా కేంద్రాల ద్వారా 30 వేల టన్నుల ఎరువులు సరఫరా చేశామని ఈ ఏడాది 75 వేల టన్నుల ఎరువులను రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రైతులు ప్రలోభాలకు గురి కాకుండా నాణ్యమైన విత్తనాలు ఎరువులు కొనుగోలు చేయాలి.

నకిలీలలను అరికట్టేందుకు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు

అనుమతులు లేని నకిలీ విత్తనాలు అరికట్టేందుకు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి తెలిపారు గ్రామస్థాయిలో విఆర్వో పంచాయితీ కార్యదర్శి గ్రామ వ్యవసాయ అధికారి(వి.ఏ.ఏ) మండల స్థాయిలో మండల వ్యవసాయ శాఖ అధికారి , తహశీల్దార్ ,ఎండిఓ, ఎస్.ఐ , డివిజన్ స్థాయిలో ప్రత్యేక అధికారిగా వ్యవసాయ శాఖ ఏ.డి.ఏ, ఆర్డీఓ సి.ఐ లతో పాటు పలువురు మండల వ్యవసాయ శాఖ అధికారుల బందంతో విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనుమతి లేని నకిలీ మరియు నిషేధిత విత్తనాలను విక్రయాలు జరిపితే కేసులు నమోదు చేస్తామన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సేకరించిన వివరాల ప్రకారం స్థానిక చిపరావూరు రైల్వే స్టేషన్ సమీపంలో ఓ చికెన్ స్టాల్లో పనిచేసే బెల్లంకొండ నాగరాజు(35) చినరావూరు రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి మృతి చెందాడు. కొల్లూరు మండలం బొద్దులూరు పాడుకు చెందిన నాగరాజు గత కొంత కాలం క్రితం నుంచి చినరావూరులో ఉంటున్నారు. అదే ప్రాంతానికి చెందిన మురళి ఏర్పాటు చేసిన చికెన్స్టాల్లో పనిచేస్తున్నాడు. ఈ నేపధ్యంలో మృతదేహాన్ని గుర్తించిన నాగరాజు భార్య, కుటుంబ సభ్యులు బుధవారం మృతదేహం వద్ద ఆందోళన చేశారు. చికెన్ స్టాల్ ఓనర్ నాగరాజును హింసిస్తుండేవాడని, ఇంటికి సంబందించిన డాక్కుమెంట్ కూడా తన వద్ద ఉంచుకుని, షాపులో పనిచేయించుకుంటూ డబ్బులిచ్చేందుకు నానా ఇబ్బందులు పెట్టేవాడని ఆరోపించారు. గతంలో నాగరాజుపై దాడి చేసినట్లు కూడా వాపోయారు. నాగరాజును షాపు ఓనర్ హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులకు నాగరాజు కుటుంబ సభ్యులు పిర్యాదు చేశారు. కాగా రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు లోకోపైలెట్ సమాచారం ఉందని, అయినప్పటికి నాగరాజు కుటుంబ సభ్యుల ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని విచారిస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-ఫిరంగిపురం

ఈ నెల 5వ తేదీన రోడ్డు ప్రమాదంయలో గాయపడ్డ మండలంలోని గొల్లపాలెం గ్రామానికి చెందిన వృద్ధురాలు కొమ్మనబోయిన మంగమ్మ (69) చికిత్స పొందుతూ మృతి చెందింది. కారం పట్టించేందుకని 5వ తేదీ సాయంత్రం ఫిరంగిపురంలోని దుర్గా గుడి పక్కనగల కారం మిల్లు వద్దకు వెళ్లేందుకని రోడ్డు మార్జిన్ లో నిలబడి ఉండగా గుంటూరు వైపు నుండి అతివేగంగా మోటార్ సైకిల్పై వస్తున్న సుబ్బారావు ఆమెను ఢీకొట్టాడు. రోడ్డుపై పడిపోయిన మంగమ్మను, ఆమె బంధువులు ఫిరంగపురంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించి తదుపరి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోచేర్చారు. చికిత్స పొందుతన్న ఆమె బుధవారం ఉదయం చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కుమారుడు రామదాసు ఫిర్యాదు మేరకు ఫిరంగిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ హెప్సీబా మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఖాసిం పీరా

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తూ, దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయని పెదనందిపాడు ఎంపీపీ టి.హెప్సీబా అన్నారు. బుధవారం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుగులో స్థానిక జడ్పీ పాఠ శాల ఆవరణలో పెదనందిపాడు సేవ శక్తి యూత్ ఆధ్వర్యంలో వై ఎస్ ఆర్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు మొదట ఫ్రెండ్లీ మ్యాచ్ గా గుంటూరు, కృష్ణ జిల్లాల బాలికల జట్లతో పోటీలను నిర్వహించారు. అనంతరం పురుషులకు నరసరావుపేట-బేతపూడి, పాలపర్రు-పెదనందిపాడు జట్లకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పోటీల నిర్వహణ కమిటీ గౌరవాధ్యక్షులు, పత్తిపాడు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ షేక్ ఖాసిం పీరా, అధ్యక్షులు ఏపీ పాలెం సొసైటీ చైర్ పర్సన్ కూరేటి భూషయ్య, కార్యదర్శి, సినీ దర్శకులు చెరుకూరి సాంబశివరావు ఉప ఎంపీపీ సాంబశివరావు, యార్డ్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ మాలతి, సర్పంచ్ దాసరి పద్మారావు, దివి రాంబాబు, సేవశక్తి యూత్ ఫౌండర్ కొమ్మినేని గోపి, అధ్యక్షులు శాంతి బాబు ,గోవిందు, ఉమర్, రవి పాల్గొన్నారు.

చేపల పెంపకంపై ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

నిడుబ్రోలు మత్యక్షేత్రం నందు ఎన్ఎఫ్డిబి వారి ఆర్థిక సౌజన్య ముతో పొన్నూరు మండలంలోని ఎస్సీ మత్స్యకారులకు మంచినీటి వనరులలో చేపల పెంపకం పై ఈ నెల 5వ తేదీ నుండి 7వ తేదీ వరకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమం లో చేప పిల్లల పెంపకము, ఉత్పత్తి, చెరువులలో చేపల పిల్లల పెంపకం లో పాటించాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా సబ్సిడీపై ఇస్తున్న యూనిట్లు డొమెస్టిక్ మార్కెటింగ్ ద్వారా ఫిషాంధ్ర షాపులో ఏర్పాటుపై అవగాహన కల్పించారు. నూతన టెక్నాలజీ ఆర్ఏఎస్ యూనిట్ రీ సర్క్యులేటరీ ఆక్వా కల్చర్ సిస్టం పై అవగాహన కోసం నగరం మండలంలోని పమిడిమర్రులో ఉన్న ఆర్ ఏ ఎస్ యూనిట్ను ఫీల్డ్ విజిట్ చూపించారు. మూడు రోజులు శిక్షణ పొందిన ఎస్సీ మత్స్య కారు లకు శిక్షణ దీపిక, సర్టిఫికెట్లను శిక్షణా భత్యాలను అందజేశారు. గుంటూరు జిల్లా మత్యధికారి గాలి దేవుడు, బాపట్ల జిల్లా మత్స్య శాఖాధికారి పి.సురేష్,మత్స్య శాఖ సహాయ సంచాలకులు డి.కృష్ణ కిషోర్, గుంటూరు మత్స్య శాఖ అభివృద్ధి శాఖాధికారి జయనుల్లా ఖాన్ , నిడుబ్రోలు మత్స్య శాఖ సహాయ పరిశీలకులు ప్రశాంత్ గ్రామ మత్స్య సహాయకులు మాధవి గఫూర్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టు, గురుజాలలో
ఓ.యస్. నెం. 302/2019

బిట్వీన్ :
దుగ్గిరాల శివారెడ్డి .... వాది
వర్సెస్
దారా శ్రీనివాసరావు ... ప్రతివాది
టు,
దారా శ్రీనివాసరావు, హిందూ, 41 సంll, పంచాయతీ కార్యదర్శి, చిరునామా ఇం.నెం.233, వీధి నెం.100, యన్.డి.యన్. ఏరియా, ఇందిరానగర్, మంగళగిరి పట్టణము, గుంటూరుజిల్లా.
మీపైన ప్రామిసరీ నోట్ బాకీ చెల్లించమని కోరుతూ దావా వేసియుండగా, శ్రీ కోర్టువారు మీకు సమన్లు ఎన్ని పర్యాయములు పంపించిననూ, మీరు తీసుకొనియుండలేదు. కావున ది. 27-6-2023వ తేదీన వాయిదా వేసియున్నారు. ఆ రోజు ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, లేదా అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనియెడల మీ పరోక్షమందు దావా తీర్మానము చేయబడును.
వాయిదాతేది: 27-6-2023

చల్లా రామిరెడ్డి, బి.యస్., బి.ఎల్.,
వాది తరపు న్యాయవాది,
గురజాల - 522 415.
సెల్ : 94414 09796

COURT NOTICE
IN THE COURT OF THE HON'BLE
PRL.JUNIOR CIVIL JUDGE:: GUNTUR
O.S NO: 1412 /2021

Between:
Velpula Lakshmi Kumari ....Plaintiff
And
Kampa Punnamma & Others
.... Defendants
To.
D-1: Kampa Punnamma,
W/o.Late Prakash Babu,
D-2: Kampa Prudhvi Shanth
S/o. Late Prakash Babu,
D-3: Kampa Pranay Rai
S/o. Late Prakash Babu,
D-4: Kampa Pooja,
D/o. Late Prakash Babu,All are
R/o.Quater No.243/G,Railway Quaters,
6th lane Butchaiah Thota, Guntur-522001
పై నెంబరు దావాలో ప్రతివాదులు అయిన మీకు పై కోర్టు వారి ద్వారా మరియు రిజిష్టరు పోస్టుల ద్వారా అనేక సార్లు దావా నోటీసులు/సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది: 15-06-2023 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేక మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకోగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 15-06-2023

యర్రంరెడ్డి వెంకటేశ్వర రెడ్డి,
వాది తరపు అడ్వకేట్, గుంటూరు.

మాచవరంలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి - నరసరావుపేట

రొంపిచర్ల మండలం మాచవరం సచివాలయంలో కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రామారావు మాట్లాడుతూ 70 శాతం భూమిని సాగు చేస్తున్న కౌలురైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జి.మస్తాన్‌రావు, సిహెచ్.శ్రీనివాస్‌రెడ్డి, ఐ.ఏడుకొండలు, బి.నాగయ్య, హుస్సేన్ పాల్గొన్నారు.

రైతు భరోసా కౌల్దార్లకే దక్కాలి

- రెవెన్యూ సిబ్బంది ద్వారా కౌలురైతులను గుర్తించండి
- సంఘం ఆధ్వర్యంలో వినతులు


చాగంటివారిపాలెంలో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయడంతోపాటు రైతుభరోసాను వర్తింపజేయాలని రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని చాగంటివారిపాలెంలో సచివాలయంలో పంచాయతీ కార్యదర్శికి బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది ద్వారా కౌలు రైతులను గుర్తించాలని, వాస్తవ సాగుదారుడైన కౌలురైతుకే పంట రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తున్న విధానంగానే ఓసీ రైతులకూ ఇవ్వాలన్నారు. కౌలు రైతు సంఘం మండల నాయకులు టి.అమరలింగేశ్వరరావు మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు పూర్తి స్థాయిలో అందజేయాలన్నారు. కౌలు రైతు సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర జాత ఈ నెల 9-12 తేదీల్లో నిర్వహిస్తున్నామని, కౌల్దార్లంతా జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.జగన్మోహన్‌రెడ్డి, వెంకటాచారి పాల్గొన్నారు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

కౌలు రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి పి.మహేష్ డిమాండ్ చేశారు. కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని రెంటపాళ్ల విఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. మహేష్ మాట్లాడుతూ గ్రామ సచివాలయ పరిధిలో కౌలు రైతులను గుర్తించి. గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రూ.1.6 లక్షల వరకు వడ్డీ రాయితీతో పంట రుణాలు ఇవ్వాలిని కోరారు. భూమి లేని కౌలురైతులందరికీ ఓసీలు సహా పెట్టుబడి సహాయం రూ.25 వేలు ఇవ్వాలని, ఈ-క్రాప్‌లో కౌలురైతులనే నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యాల వలన నష్టపోయిన పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా పరిహారం కౌలురైతులకే దక్కేలా చూడాలన్నారు. మద్దతు ధరలను చట్టబద్ధం చేయాలని, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని, కేరళ తరహాలో రుణ విమోచన చట్టం తేవాలని కోరారు. 60 ఏళ్ల నుండిన వారికి రూ.6 వేలు పింఛను ఇవ్వాలన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి 12వ తేదీన మంగళగిరిలోని సిసిఎల్‌ఎ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాకు కౌల్దార్లంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు డి.మేరమ్మ, డి.తాతారావు, ఎం.నరసింహారావు, బి.రామారావు, కౌలు రైతులు మరియమ్మ, రవి, నాగార్జున పాల్గొన్నారు.


రెంటపాళ్లలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న లక్ష్మీనారాయణ

తెలుగు యువత ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని పాకాలపాడులో తెలుగు యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీని లక్ష్మీనారాయణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కొద్దిసేపు బ్యాట్ పట్టి ఆటాడారు. కార్యక్రమంలో నాయకులు ఎం.శివనాగమల్లేశరరావు, వై.రామస్వామి, ఎం.రామ చంద్రయ్య, కె.లక్ష్మయ్య, కె.రమేష్ పాల్గొన్నారు.

అస్తవ్యస్త పారిశుధ్యంపై కమిషనర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పారిశుధ్య లోపంతో కునారిల్లుతోందని, మురుగు కాల్వల్లో పూడిక తీత పనులు చేపట్టక పోవడం వలన పారుదల సరిగా లేదని ఎంసిపిఐ (యు) పల్నాడు జిల్లా కార్యదర్శి షేక్ మొహిద్దీన్ బాషా అన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి, ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు, కొబ్బరి బోండాలు మురుగు కాల్వలలో ఉండి నీరు ప్రవహించడం లేదన్నారు. లాల్ బహుదూర్ కూరగాయల మార్కెట్ వద్ద చెత్త డబ్బాలు నడిరోడ్డు మీద ఉంచడం వలన చెత్తాచెదారం, కుళ్లిపోయిన కూరగాయలు రోడ్డు మీద పడవేయడం వలన కోళ్ల నుండి వచ్చే వ్యర్థ పదార్థాలు ఉండుట వలన విపరీతమైన చెడు వాసనలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణంలో ఎటుచూచినా రోడ్లన్నీ చెత్త పేరుకుపోయిందన్నారు. మున్సిపల్ కమిషనర్ లేకపోవడం, ప్రజలచే ఎన్నుకోబడిన మున్సిపల్ కౌన్సిల్, చైర్మన్ లేకపోవడంతో జావాబుదారితనం కొరవడిందన్నారు. నరసరావుపేటకు ఇతర ప్రాంతాల నుండి ప్రజలు రాకపోకలు పెరిగాయని, చిన్న దుకాణాలూ పెరిగి వాటి వ్యర్థాలూ కాల్వల్లో చేరుతున్నాయని చెప్పారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మహబూబ్ బాషా, జకరయ్య, మస్తాన్‌వలి, కె.వెలుగొండమ్మ, చిన్నమ్మాయి పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హోంగార్డు ప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ

ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డుకు బహుతిగా ఒక్కరోజు వేతనం

ప్రజాశక్తి - నరసరావుపేట

ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డుకు పల్నాడు హోంగార్డులు ఒక్కరోజు వేతనం రూ.5.30 లక్షలను బహుమతిగా ఇచ్చారు. తెనాలి 1వ పట్టణ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ ఇటీవల విరమణ పొందిన పల్నాడు జిల్లాకు చెందిన ఎల్‌విహెచ్ ప్రసాద్‌కు తోటిహోంగార్డులు బాసటగా నిలవడంపై ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రసాద్ దంపతులను సత్కరించి చెక్కును అందించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వై.రవికిరణ్, హోంగార్డులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి తహశీల్దార్‌గా సురేష్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండల తహశీల్దార్‌గా ఎస్.సురేష్ నియమితులయ్యారు. ఈయన గతంలో నకరికల్లులో పని చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన కె.నగేష్ మాచవరం మండలానికి బదిలీ అయ్యారు

విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఎడిఎ శ్రీధర్‌రెడ్డి

విత్తనాలు కృత్రిమ కొరత సృష్టిస్తే కేసులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

విత్తనాలు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని విత్తన డీలర్లను సత్తెనపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. సత్తెనపల్లి పట్టణంలోని పలు విత్తన దుకాణాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. స్టాక్, ధరలు తెలిసే విధంగా షాపు ఎదుట బోర్డును పెట్టాలని ఆదేశించారు. సోర్స్ సర్టిఫికెట్, వాలిడిటీ, అనుమతి ఉన్న విత్తనాలనే విక్రయించాలని చెప్పారు. రైతులకు కావాల్సిన కొన్ని ప్రత్యేక రకాలైన ప్రత్తి, మిర్చి విత్తనాలు విషయంలో కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మే డీలర్లపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. విత్తనాలు కొన్న ప్రతి రైతుకూ బిల్లులో లాట్ నంబర్, కంపెనీ, రకం మొదలైన వివరాలు సరిగా నమోదు చేసి, డీలర్, రైతు సంతకంతో కూడిన బిల్ ఇవ్వాలన్నారు. రైతులు కూడా లైసెన్సు ఉన్న డీలరు వద్ద మాత్రమే విత్తనాలు కొనాలని, పంట కాలం పూర్తయ్యే దాక బిల్లులను జాగ్రత్తగా పెట్టుకోవాలని సూచించారు.

సిగ్నల్ వ్యవస్థ ప్రారంభిస్తున్న ఎస్పీ ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

మల్లమ్మ సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభం

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీస్ శాఖ నియమించిన ఏజెన్సీ ద్వారా రూ.3 కోట్లతో పట్టణంలోని 8 ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. వీటిని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, డీఎస్పీ మహేష్ బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సిగ్నల్స్‌తోపాటు సీసీ కెమెరాలు, 4 ప్రాంతాల్లో బస్టాండ్లు ప్రారంభిస్తున్నామని తెలిపారు. సీసీ కెమెరాలు బస్టాండ్‌లో త్వరలో అందుబాటులోకి వస్తాయన్నారు. వాహన దారులు తప్పనిసరిగా నిబందనలు పాటించాలని కోరారు. మల్లమ్మ సెంటర్ ప్రాంతంలో కొంతమంది వ్యాపారులు అనధికారకంగా ఏర్పాటు చేసుకున్న రేకులు షెడ్డులు, తోపుడు బండ్లు వంటివాటిని తొలగించాలని, పోలీసులూ వాటిపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కె.విజయకుమార్, ప్రముఖ ఇంజినీర్ కె.కమలాకర్‌రెడ్డి, కె.యగ్రజ, వి.శివ, బి.విష్ణు పాల్గొన్నారు.

పెదనందిపాడు మండలం నాగులపాడు సచివాలయంలో వినతి పత్రం ఇస్తున్న బైరగాని శ్రీనివాసరావు తదితరులు

మేడికొండూరు మండలం సిరిపురంలో వినతి పత్రం ఇస్తున్న బొట్ల రామకృష్ణ తదితరులు

కౌలు రైతు సంఘం రాష్ట్ర జాతాను జయప్రదం చేయండి

జిల్లాలో విస్తృతంగా కౌలురైతు సంఘం నాయకుల ప్రచారం - షరతుల్లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలని అధికారులకు వినతి

ప్రజాశక్తి - పెదనందిపాడు

కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం నాగులపాడు సచివాలయ కార్యదర్శికి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. వాస్తవ సాగుదారులు కౌలు రైతులేనని, వ్యవసాయంలో 70 శాతం మంది కౌలు రైతులే ఉన్నారని తెలిపారు. కౌలు రైతులకు సాగు గుర్తింపు కార్డులు రావడంలేదని, ప్రభుత్వం భూ యజమాని సంతకం ఉంటేనే కౌలు రైతు కార్డులు ఇస్తామన్న నిబంధన పెట్టడంతో, పెద్ద ఎత్తున కౌలు రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఈ కారణంతో కౌలు రైతులకు రావాల్సిన రాయతీలు, పంట నష్టపరిహారం లాంటివి అందడం లేదన్నారు. దీంతో కౌలు రైతులు అప్పుల పాలు అవుతున్నారని, అందువలనే ఆత్మహత్యల్లో కౌలు రైతులే ఎక్కువగా ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కౌలు రైతుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ష్యూరిటీ లేకుండా పంట రుణాలు ఇవ్వాలని, పంటల బీమా, నష్టపరిహారాలు, పంటను అమ్ముకునే అవకాశం కౌలు రైతులకు కల్పించాలని డిమాండ్ చేశారు. కేరళ తరహా రుణ విముక్తి చట్టాన్ని చేసి కౌలు, సన్న, చిన్నకారు రైతుల రుణాలు రద్దు చేయాలని కోరారు. కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాపితంగా ప్రచార జాతా బుధవారం నెల్లూరు జిల్లా పొట్టిపాలెం నుండి ప్రారంభమయ్యిందన్నారు. ఈ జాతా గుంటూరు జిల్లాలోని 8వ తేదీ సాయంత్రం 4గంటలకు పెదనందిపాడు వస్తుందన్నారు. జాతా కార్యక్రమంలో కౌలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని బైరగాని పిలుపిచ్చారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొత్త శివ నాగేశ్వరరావు, రైతు సంఘం మండల కార్యదర్శి కొత్త వెంకట శివరావు, కౌలు రైతులు పాడిబండ్ల నాగబాబు, నాదెండ్ల గురుమూర్తి, బండి రాంబాబు, కాపు అశోక్, జి ఏడుకొండలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -మేడికొండూరు

మేడికొండూరు మండలం సిరిపురం గ్రామంలో బుధవారం కౌలు రైతులలో నిర్వహించిన సమావేశంలో సంఘం నాయకులు బొట్ల రామకృష్ణ ప్రసంగించారు. ప్రభుత్వ ఉద్యోగులచే కౌలుదారులను గుర్తించి గ్రామ సభలో వారికి కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 30 లక్షలు మంది కౌలుదారులు కౌలు గుర్తింపు కార్డులు పొందలేకపొతున్నారన్నారు. అన్నారు. అందులో ప్రభుత్వం 5 లక్షల మందిని గుర్తించి 80 వేల మందికి మాత్రమే రైతు భరోసా కార్యక్రమం అందజేశారన్నారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర జాతా శుక్రవారం మండలంలోని సిరిపురం వస్తుందన్నారు. జాతా వద్దకు కౌలు రైతులు హాజరవ్వాలని కోరారు. 12న మంగళగిరి సిసిఎల్ఎ ఆఫీసు వద్ద ధర్నాలో కూడా పాల్గొనాలని పిలుపిచ్చారు. గ్రామంలోని కౌలుదారుల సంతకాలు సేకరించి సచివాలయంలో సీనియర్ అసిస్టెంట్ డి శ్రీనివాసులుకి వినతిపత్రం ఇచ్చారు. సేకరించిన లక్షల సంతకాలతో ఉన్న పత్రాలను లను మంగళరిలోఉన్న అధికారికి ఇచ్చి ధర్నా కార్యక్రమం నిర్వహిస్తారు అని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మిరియాల కృష్ణ, కొండేపొగు వెంకట్రావు, దుర్గం ఆంజనేయులు, ఎన్ సామ్రాజ్యం, దేవదాసు పాల్గొన్నారు.

సిజిజిబికి అటల్ పెన్షన్ యోజన పురస్కారం

ప్రజాశక్తి-గుంటూరు

పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ (PFRDA) నుండి అటల్ పెన్షన్ యోజన పథకం కింద 2022-23 ఆర్థిక సంవత్సరానికి చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ వార్షిక ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నది. బుధవారం న్యూఢిల్లీలో అటల్ పెన్షన్ యోజన వార్షిక అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవార్డుల విజేతలను సత్కరించారు. పిఎఫ్ఆర్‌డిఎ చైర్మన్ దీపక్ మొహంతి చేతులమీదుగా సిజిజిబి రీజనల్ మేనేజర్ జి.ఎన్.ఎన్.సతీష్‌కుమార్, సీనియర్ మేనేజర్ మహమ్మద్ మజీద్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సిజిజిబి చైర్మన్ టి.కామేశ్వరరావు మాట్లాడుతూ బ్యాంకుకు అవార్డు రావడానికి చిత్తశుద్ధితో కృషి చేసిన ఉద్యోగులు, బిజినెస్ కరస్పాండెంట్స్‌కు అభినందనలు తెలిపారు.

అవార్డు అందుకుంటున్న సతీష్‌కుమార్, మజీద్ తదితరులు

ఐఎస్‌వో సర్టిఫికేట్‌ను ప్రిన్సిపాల్‌కు అందిస్తున్న బృందం

ఎఎస్ఎన్ కళాశాల ఐఎస్‌వో గుర్తింపుకు పరిశీలన

ప్రజాశక్తి-తెనాలి:

స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలకు ఐఎస్ఓ గుర్తింపు రెన్యువల్ ప్రక్రియ పూర్తయ్యిందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకట రమణ చెప్పారు. కళాశాల్లో బుధవారం ఆయన మాట్లాడుతూ 2018లోనే కళాశాలకు ఐఎస్ఓ గుర్తింపు ఉందని, దాని రెన్యువల్ కొరకు ఐఎస్ఓ ఇన్‌స్పెక్టర్ కె.కుటుంబరావు, ఎ.సింగయ్య కళాశాలను పరిశీలించారన్నారు. ల్యాబొరేటరీ, లైబ్రరీ, ఉత్తీర్ణత శాతం, తరగతి గదులు, డిజిటల్ క్లాస్‌రూమ్స్, కళాశాల్లో ఉన్న సౌకర్యాలను వారు పరిశీలించి, ఐఎస్ఓ గుర్తిపు సర్టిఫికేట్‌ను అందిచినట్టు చెప్పారు. అలాగే కళాశాలకు గతంలోనే పిసిఐ, ఏపి ప్రభుత్వం, యుజిసి గుర్తింపు, బి ఫార్మసి పర్మినెంట్ అఫిలియేషన్, ఏఎన్‌యూ ఆఫిలియేషన్ ఉన్నట్లు చెప్పారు. ఇన్‌స్పెక్షన్‌లో కోఆర్డినేటర్ డాక్టర్ కె.సాయిరాజేష్, కె.కల్యాణ చక్రవర్తి, సిహెచ్ నాగశైలజ, డాక్టర్ టి.లక్ష్మీదుర్గ, ఎ.సోని ప్రియాంక పాల్గొన్నారు.

కెఎల్‌యు ఎన్‌సిసి క్యాడెట్లకు బెస్ట్ సీనియర్స్ అవార్డులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఈనెల 1న జిల్లా స్థాయి వార్షిక శిక్షణ కోసం గుంటూరు జిల్లా గోళ్లమూడిపాడులోని నాట్కో కేంద్రీయ విద్యాలయానికి తరలి వెళ్లిన 22వ ఆంధ్రాబెటాలియన్ ఎన్ సిసి క్యాడెట్లు కెఎల్ విశ్వవిద్యాలయంలో బిటెక్ చదువుతున్న వీరు ఎన్ సిసిలో ఎంతో చురుకుగా ఉంటూ ఆయా శిక్షణా తరగతులకు హాజరు కావడంతో పాటు లెఫ్టినెంట్ వి.మౌనిక అద్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నేపధ్యంలో ఈ నెల 1వ తేది నుండి గోళ్లమూడిపాడులో జరుగుతున్న జిల్లా స్థాయి శిక్షణా శిబిరంలో జూనియర్ ఎన్ సిసి క్యాడెట్లకు కెఎల్ యు కు చెందిన సీనియర్ ఎన్ సిసి క్యాడెట్లు శిక్షణ ఇవ్వడంతో పాటు శిక్షణా శిబిరానికి నాయకత్వం వహించడం, ఉత్తమ సేవ, మార్గదర్శకత్వాన్ని అందించినందుకుగాను నాలుగు జిల్లాల గ్రూప్ కమాండర్ ఎస్.ఎం.చంద్రశేఖర్ బెస్ట్ సీనియర్స్ అవార్డు అందించి అభినందించారు. అవార్డు అందుకున్న వారిలో కెఎల్ యు కు చెందిన 22వ ఆంధ్రా బెటాలియన్ ఎన్ సిసి క్యాడెట్లు వి.సాత్విక్, జి. సాయి లక్ష్మి లు ఉన్నట్లు లెఫ్టినెంట్ వి.మౌనిక తెలిపారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్సులర్ డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్ధి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్. హనుమంతరావు క్యాడెట్లను అభినందించారు.

సాత్విక్‌ని, జి.సాయిలక్ష్మిని అభినందిస్తున్న గ్రూప్ కమాండర్ ఎస్.ఎం.చంద్రశేఖర్

11న పవర్ లిఫ్టింగ్ ఎంపికలు

ప్రజాశక్తి - మంగళగిరి

ఈనెల 11వ తేదీన ఉదయం 10 గంటలకు మంగళగిరి ఫిట్ జోన్ జిమ్ సెంటర్లో గుంటూరు జిల్లా మెన్ అండ్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ అండ్ బెంజ్ ప్రెస్ సీనియర్ టీం సెలక్షన్ నిర్వహిస్తున్నామని ఫిట్ జోన్ జిమ్ కోచ్ షేక్ సందని బుధవారం తెలిపారు. అర్హత సాధించిన క్రీడాకారులను ఈనెల 24,25 తేదీల్లో నెల్లూరు పట్టణంలో జరిగే ఆంధ్రప్రదేశ్ సీనియర్ స్టేట్ ఎక్యుప్డ్ మెన్ అండ్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ అండ్ బెంజ్ ప్రెస్ పోటీలకు గుంటూరు జిల్లా తరపున ఆడతారని తెలిపారు.

నేడు వైస్ చైర్మన్ ఎన్నిక

ప్రజాశక్తి-తెనాలి:మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక గురువారం జరుగనుంది. ఉదయం 11 గంటలకు పురపాలక సంఘ కౌన్సిల్ హాల్లో ఎన్నికల అధికారిగా నియమించబడిన సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఎన్నిక నిర్వహించనున్నారు. వైస్ చైర్మన్‌గా 40వ వార్డు కౌన్సిలర్ అత్తోట నాగవేణి ఎన్నిక లాంఛన మేనని తెలుస్తోంది. కౌన్సిల్‌లో మొత్తం 8 మంది టిడిపి సభ్యులు కాగా, మిగిలిన 32 మంది వైసిపి సభ్యులే. దీంతో ఎమ్మెల్యే ఎవరికి అవకాశం ఇస్తే వారే వైస్ చైర్మన్. వైస్ చైర్మన్2గా పనిచేసిన గుంటూరు కోటేశ్వరరావు గతేడాది డిసెంబర్‌లో రాజీనామా చేయటంతో వైస్ చైర్మన్ -2 ఎన్నిక జరుగుతోంది.

మాట్లాడుతున్న వై నేతాజీ

కనీస వేతనం అమలు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి- మేడికొండూరు

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ అన్నారు. పేరేచర్ల లోని నీకో ఆగ్రో ఆయిల్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ లో బుధవారం యూనియన్ విస్తృత సమావేశం వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ నాలుగేళ్ల కాలంలో నిత్యవసర వస్తువుల ధరలు అసాధారణంగా పెరిగాయన్నారు. కార్మికుల వేతనాలు మాత్రం ధరల కనుగుణంగా పెరగలేదన్నారు. యాజమాన్యాన్ని వేతనాలు పెంచమని అడిగితే కనీసం చర్చలు జరపకుండా ఏకపక్షంగా వారు నామమాత్రంగా పెంచి ఇంతకుమించి పెంచం అనడం సరికాదన్నారు. వేతనాలు పెంచుకుంటే ఆందోళనకు సిద్ధం కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు బి లక్ష్మణరావు, నాయకులు షేక్ భాషా, సుధాకర్ రెడ్డి, సాంబయ్య, మీరాసాహెబ్ పాల్గొన్నారు.

సమస్యలివిగో పరిష్కరించండి : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి : రాజధానిలో భాగమైన ఉండవల్లిలో సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నాయకులు బుధవారం స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అమరారెడ్డి కాలనీ, టెలిఫోన్ కాలనీ, ఉప్పునీళ్లు బావి ప్రాంతం, కుమ్మరికుంట తదితర ప్రాంతాల్లో రోడ్లు, ఇళ్ల పట్టాలు, డ్రైయినేజీ సమస్య వెంటనే పరిష్కరించాలని కోరారు. గత 40 సంవత్స రాల నుంచి ఈ ప్రాంతంలో నివశిస్తున్న వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, గ్రామకంఠంలో ఉన్న స్థలాలను పరిశీలించి వాటికి పట్టాలివ్వాలన్నారు. దీనిపై ఎమ్మెల్యే సాను కూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. ఆ మేరకు ఇంజనీరింగ్ అధికారులను ఆ ప్రాంతానికి పంపించి నివేదిక ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాజధానికి డివిజన్ కార్యదర్శి ఎం.రవి నాయకులు బి.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, యు.పార్ధసారధి, శివయ్య, వెంకయ్య, సిహెచ్.శ్రీనివాసరావు, నర్సిరెడ్డి, ఇమ్మానుయేలు పాల్గొన్నారు.

నేడు రెంటచింతల,గోలి ఉపసర్పంచ్‌ల ఎన్నిక

ప్రజాశక్తి - రెంటచింతల

మేజర్ పంచాయతీ రెంటచింతల, గోలి గ్రామ ఉపసర్పంచ్‌ల ఎన్నిక నేడు ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎన్నికల అధికారులుగా రెంటచింతల ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ కొత్త నరేంద్రరెడ్డి, గోలికి ఈవోపీఆర్డి రామచంద్ర రావు వ్యవ హరించనున్నారు. రెంటచింతలలో 18, గోలిలో 10 మంది వార్డు మెంబర్లు ఉన్నారు. వీరంతా వైసీపీకి చెందిన వారే. చెయ్యెత్తే పద్ధతి ద్వారా విజేత పేరును ప్రకటించనున్నారు

ముగిసిన వేసవి సంగీత శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక కొత్తపేటలోని ప్రతిభాగాన కళా శిక్షణ కేంద్రంలో గత మే 6న ప్రారంభమైన తరగతులు జూన్ 7వ తేదీతో ముగిశాయి. ఈ మేరకు ప్రఖ్యాత జాతీయ సంగీత కారులు వినుకొండ పల్నాడు జిల్లా రాజు పదముత్యం పేర్కొన్నారు. ఈ క్లాసుల్లో అన్ని వయసులకు చెందినవారు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. సంగీత పాఠాలు, భక్తి, దేశభక్తి, గీతాలకు సంబంధించి అభ్యాసం చేశారు. కార్యక్రమంలో మోక్షిత్, క్రీనో, నెహ్, జయశ్రీ, కుసుమ, దీక్షిత, అవంతిక, మంజుష ,రాజ్ కుమార్, హేమ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

ప్రజాశక్తి - పెదకూరపాడు

పేద విద్యార్థిని నాదెండ్ల మేఘనకు ల్యాప్‌టాప్‌ను పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య ఉన్నత శిఖరాలకు చేరు స్తుందని,టిడిపి మాత్రమే ఉన్నత విద్యా అవ కాశాలకు కల్పిం చిందని అన్నారు.. టిడిపి కార్యదర్శి, మం డల టిడిపి అధ్య క్షులు ఎ.రమేష్, నరసరావుపేట పార్ల మెంట్ డాక్టర్ సెల్ కార్యదర్శి జి.చిన్నరాజు విద్యార్థికి ల్యావ్ టాప్ సమకూర్చారు.

మరణ సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం

ప్రజాశక్తి - బెల్లంకొండ

ఇటీవల మృతి చెందిన సంగం డెయిరి పాల కేంద్రం సభ్యురాలు ఈమని మల్లేశ్వరికి సంఘం డైరీ తరపున డి.వి.సి (ధూళిపాళ్ల వీరయ్య చౌదరి) అభయ స్కీం ద్వారా మరణ సహాయ నిధి కింద రూ.60 వేల చెక్కును బుధవారం అందజేశారు. సంఘం డెయిరి మేనేజర్లు గోపి, శ్రీనివాసరావు, రూటు సూపర్‌వైజర్ సుధీర్, సంఘం అధ్యక్షులు వి.సీతారామిరెడ్డి చేతుల మీదుగా నామిని, మల్లేశ్వరి భర్త ఈమని వేలాద్రికి గ్రామ పెద్దల సమక్షంలో అందజేశారు. సంగం డెయిరి గంగిరెడ్డిపాలెం ఎంసిసి పరిధిలోని నాగిరెడ్డి పాలెంలో వెన్నా సీతారాంరెడ్డి నిర్వహిస్తున్న సంగం డెయిరి పాల కేంద్రం సభ్యురాలు ఈమని మల్లేశ్వరి.

తాగేనీరు రాదు! .. నడిచే దారి లేదు!

- కాలం చెల్లిన పైపులతో పట్టణంలో తాగునీటి సరఫరా
- 11వ వార్డులోని జక్రయ్య మందిరం బజారులో పరిస్థితి అధ్వానం
- తాగునీటి కోసం వేసిన పైపులైన్‌కు లీక్‌లు
- తవ్విన రోడ్డు సరిగా పూడ్చని వైనం

పైపులైను లీకులను చూపుతున్న స్థానికులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణములో మంచి నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన సిమెంట్ పైపులు సుమారు 35, 40 సంవత్సరాల క్రితం నాటివి బాగా పాతబడిపోవడంతో ఆ పైపులు దాదాపు పాడైపోయాయి. వాటికి లీకులు పడటంతో మురుగు నీరు పైపుల్లోకి పోతుండటంతో పట్టణ ప్రజలకు సరఫర అవుతున్న తాగునీరు కలుషితమైపోయింది. కలుషితనీరు తాగడం వల్ల ప్రజలు అనారోగ్యంపాలవుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన మున్సిపల్ అధికారులు, నాయకులు మాత్రం తూతూ మంత్రంగా బాగు చేయిస్తున్నారు. ముఖ్యంగా వీటి మరమ్మతుల నిమిత్తం తవ్విన గుంతలను పూడ్చేందుకు సంవత్సరాల కాలం పడుతోందని ప్రజలు వాపోతున్నారు.

11వ వార్డులోని న్యూ ఈస్ట్ క్రిస్టియన్ పల్లెలోని జక్రయ్య మందిరం వీధి బజారులో తాగునీటి పైపులైను ఏర్పాటు నిమిత్తం ఏడాది క్రితం మట్టిని తవ్వి, మంచినీటి పైపులైను వేశారు. అయితే, ఏడాదిగా ఆ రోడ్డును సరిగ్గా పూడ్చక పోవడంతో ఆ ప్రాంతంలోనే వేసిన కొత్త పైపులైనుకు అనేక లీక్‌లు ఏర్పడంతో ఆ ప్రాంత మంతా బురద మయం అవుతోందని అక్కడ నివాసం ఉంటున్న పల్లపు సంతోషమ్మ, కోమటి కోటేశ్వరమ్మ, జంగాల మార్తమ్మ తెలిపారు. అప్పుడప్పుడు అధికారులు, నాయకులు ఇక్కడికి వచ్చి చూసిపోతున్నారే తప్ప, పనులు మాత్రం ఎక్కడివి అక్కడే ఉన్నట్లు చెప్పారు. దీనికి తోడు నడకకు సరైన దారి లేదని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు నాయ కులు

11వ వార్డులో సరిగా పూడ్చని పగలగొట్టిన సిమెంట్ రోడ్డు

పట్టించుకుని సక్రమంగా తాగునీరు ఇవ్వాలని, తవ్విన రోడ్డును పూడ్చాలని కోరారు. సిమెంట్ రోడ్డు పగులకొట్టి ఇప్పటికి సుమారు 8 నెలలుక కావస్తోందని, అసలే 8 అడుగుల రోడ్లు అందులోనూ నడక చాలా ఇబ్బంది కరంగా ఉందన్నారు. సుమారు 80 తాగునీటి పంపులు వేశారని, నీరు సక్రమంగా రావడం లేదని అన్నారు. నాణ్యతలేని పైపులు వాడటంతో లీకులు అవుతున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షులు సాతులూరి లూథర్ అన్నారు. వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలని, రోడ్లను సక్రమంగా వేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ వీధి మహిళలతో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతో వంద శాతం అక్షరాస్యత

ప్రజాశక్తి - నరసరావుపేట

సమాజంలో బాల కార్మికుల నిర్మూలన జరిగితేనే వందశాతం అక్షరాస్యత సాధ్యమవుతుందని ప్యానల్ న్యాయవాదులు అచ్చి ఏడుకొండలు, శ్రీరామినేని ప్రసాద్ లు అన్నారు. నరసరావుపేట మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఒ.నాగేశ్వరావు ఆదేశాల మేరకు బుధవారం రొంపిచర్ల మండలంలోని నల్లగార్లపాడు గ్రామ సచివాలయంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం గురించి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి పారాలీగల్ వాలంటీర్ గోదా రమేష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న న్యాయవాదులు ఏడుకొండలు, ప్రసాద్ లు మాట్లాడుతూ పద్నాలుగేళ్ల వయస్సు లోపు వారిని పనులకు పంపకూడదని అన్నారు. ఈ వయసు వారితో వివిధ పనులు చేయించుకునే వివిధ సంస్థల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకొని, కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. సదస్సులో పారాలీగల్ వాలంటీర్ గోదా సందీప్ కుమార్, సర్పంచ్ కె. వెంకటరెడ్డి రాజేశ్వరి, పంచాయితి కార్యదర్శి శ్రీనివాసరావు, వీఆర్వో జగన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాదులు

రెంటచింతల నూతన ఎంపీడీవో గా మహాలక్ష్మి

ప్రజాశక్తి - రెంటచింతల

రెంటచింతల ఎంపీడీవో గా యార్ల మహాలక్ష్మి నియ మిస్తూ జిల్లా పరిషత్తు సీఈవో మోహన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె దాచేపల్లి ఎంపీడీవో గా పని చేస్తూనే డిస్టిక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా, గ్రామ వార్డు సచివాల యాల్లో స్పెషలాఫీసర్ గా పని చేస్తున్నారు గురువారం ఇక్కడ పద వి బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన ఎంపీడీవో గౌసియా బేగం, బొల్లాపల్లి మండలానికి బదిలీ అయ్యారు.

అనుమానాస్పదస్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సత్తెనపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన మృతదేహం పడి వుండటాన్ని గ్యాంగ్ మెన్ గమనించాడు. ఈ సమాచారాన్ని స్టేషన్ మాస్టర్‌కు, రైల్వే పోలీసులకు తెలియజేశారు. నడికుడి రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలిం చారు. మృతుడు తెలంగాణకు చెందిన వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వయసు నలభై ఏళ్లు ఉంటుందని, పింక్ కలర్ బారు చేతుల చొక్కా, ప్యాంట్ ధరించిన ఉన్నట్లు చెప్పారు. వివరాలకు జిఆర్‌పి కానిస్టేబుల్ సునీల్ సెల్ నెంబర్ 9440309859లో సంప్రదించాల్సిందిగా కోరారు.

దాడి కేసులో ముగ్గురికి జైలు, జరిమానా

ప్రజాశక్తి - వినుకొండ

శావల్యాపురం మండలం ముంద్రు వారి పాలెం గ్రామంలో పొలం దారి విషయంలో దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను నరసరావుపేట అసిస్టెంట్ సీనియర్ సివిల్ సెషన్స్ జడ్జి వారిని దోషులుగా గుర్తించి మూడు సంవత్సరాలు జైలు శిక్షతోపాటు నాలుగు వేలు జరిమానా విధించినట్లు శావల్యాపురం పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన ధోపాటి ఏసు అతని కుమారుడు నాగార్జున 2016లో అదే గ్రామానికి చెందిన దాసరి అంకారావు, మరియబాబు, వజ్రం అనువారు పొలంబాట విషయంలో గొడవపడి చంపాలని పలుగులతో దాడి చేశారనే కేసులో బుధవారం న్యాయమూర్తి వాద ప్రతి వాదనలు విన్న తర్వాత దాడికి పాల్పడిన ముగ్గురిని దోషులుగా నిర్ధారించి మూడు సంవత్సరాల పాటు సాధారణ కారాగార జైలు శిక్ష, నాలుగు వేల రూపాయల జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - బెల్లంకొండ

ఇటీవల కురిసిన గాలివానకు మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లకు ఇరువైపుల ఉన్న చెట్లు, చెట్టు కొమ్మలు నేలకొరిగాయి. ఘటన జరిగి నేటికీ పది రోజులు కావస్తున్న విరిగిన చెట్ల కొమ్మలు రోడ్లపై ఉండటంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహన దారులు భయాందోళ నకు గురవుతున్నారు. విరిగిన కొమ్మలు కొన్ని, చెట్టుకు వేలా డుతూ ఎప్పుడు ఊడి రోడ్డుపై పడతాయా అన్నట్టుగా ఉన్నాయి. మాచాయి పాలెం పరిధిలోని శ్మశాన వాటిక వద్ద ఉన్న చెట్లకు విరిగి వేలాడుతున్న కొమ్మలు ఉన్నాయి. వీటిని తొలగిం చాల్సిన సంబంధింత శాఖాధికారులు మాత్రం తమ కేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

రేపు పాత బాపట్ల తాలూకా మృతవీరుల స్మారక సభ

ప్రజాశక్తి-పెదనందిపాడు

పాత బాపట్ల తాలూకా మృత వీరుల స్మారక సభ జూన్ 9 వ తేదీ ఉదయం 8 గంటలకు పాలపర్రులో జరుగుతుందని సిపిఎం మండల కార్య దర్శి దొప్పల పూడి రమేష్ బాబు తెలి పారు. ఈ కార్యక్రమానికి సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు హాజరవుతారని, సిపిఎం సానుభూతిపరులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమరులకు నివాళులర్పిం చాల్సిందిగా కోరారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని కొత్తూరు, సలాం సెంటర్ సచి వాలయాల పరిధిలోని లబ్దిదారులకు ఇళ్ల పట్టాలను బుధవారం నవులూరు లేఅవుట్‌లో అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇళ్లు లేని వారు ఉండ కూడదనే లక్ష్యంగా ప్రతిఒక్కరికి ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంటిఎంసి అధి కారులు, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

జగదీశ్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఫ్రైజ్ ఆడోనియా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధితో బాధపడుతున్న 200 మంది వ్యాధిగ్రస్తులకు 11రకాల నిత్యావసర వస్తువులతో కూడిన పోషకాహారం 10 కేజీల కిట్‌ను ఉచితంగా అందజేశారు. పొన్నూర పట్టణం లోని అంబేద్కర్ భవనంలో బుధవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగదీశ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బుస్సా సూరిబాబు, బాపట్ల జిల్లా ఆరవ అదనపు కోర్ట్ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాతంగి శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ ఫుడ్ అందించడం చాలా అభినందనీయమని వక్తలు కొనియాడారు. జిల్లా రైతు విభాగం కార్యదర్శి బొద్దులూరి రంగారావు, ఆరమండ వేణు, సిద్ధంశెట్టి శ్రీనివాసరావు మరియు ట్రస్ట్ చైర్మన్ పల్లెక విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ధార్మిక సంస్థల పర్యవేక్షణ ప్రచార ప్రతినిధిగా షేక్‌నాజర్

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు నియోజకవర్గ ముస్లిం మైనార్టీ ధార్మిక సంస్థల పర్యవేక్షణ ప్రచార ప్రతినిధిగా వైసిపి మైనార్టీ నాయకులు షేక్ నాజర్ ను ఎంపిక చేశారు. ఈ విషయాన్ని బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాజర్ తెలిపారు. ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు గత నాలుగేళ్లఓ చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆయన వివరించారు. మసీదుల్లో పనిచేసే మౌజన్, ఇమామ్ లకు రూ.5 వేలు, రూ.10 వేలు చొప్పున గౌరవ వేతనం అందించి ఆర్థికంగా వారికి సహాయం అందించారన్నారు. ఉర్దూ భాషను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ అధికార భాషగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి దాన్ని చట్టంగా మార్చిందన్నారు. మదరసాల్లో విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని అన్నారు.

కౌలు చట్టాన్ని మార్చండి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

కౌలు రైతులకు భూ యజమాని సంతకముతో సంబంధం లేకుండా కౌలు రైతు కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం నాయకులు కోరారు. పొనుగు పాడులో కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం రైతు భరోసా అధికారి గణేష్‌కు అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎస్ఎం వలి మాట్లాడుతూ మన రాష్ట్రంలో నూటికి 70 మంది కౌలు రైతులే వ్యవసాయం సాగు చేస్తున్నారని కోటి మంది ప్రజలు కౌలు పై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. ఎక్కువమంది భూ యజమానులు వ్యవసాయాన్ని వదిలి ఇతర వృత్తులు చేసుకుంటూ ఇతర ప్రాం తాలకు వెళ్లారని, గ్రామాలలో కూలినాలి చేసుకుంటూ దళితులు, బలహీన వర్గాలు, నిరుపేదలు, కౌలు వ్యవసాయంలోకి మారారని అన్నారు. గతంలో సాగు ధ్రువీకరణ పత్రాలు, రుణాత్కార్డులు ఇచ్చి కొద్ది మోతాదుల్లో కౌలు రైతులకు ఉపయోగ పడ్డాయన్నారు. గతంలో ఉన్న కౌలు చట్టాలను రద్దుచేసి, భూ యజమాని సంతకము ఉంటేనే కౌలు కార్డులు ఇస్తామని ప్రస్తుత ప్రభుత్వం నిబంధన చేర్చిందని, దీంతో, భూ యజమానులు సంత కం పెట్టడానికి ముందుకు రావడం లేదని, దీని ఫలి తంగా కౌలు చేస్తున్న రైతులు సీసీ కార్డులు పొందలేక పోతున్నా రన్నారు. కౌలు రైతుల కష్టాలు తీరాలంటే ఇప్పుడున్న కౌలు చట్టాన్ని మార్చాలని, భూ యజమాని సంతకం అనే నిబంధనను కచ్చితంగా తొలగించాలని అన్నారు. గ్రామసభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పంటల బీమా, నష్టపరిహారాలు, రైతు భరోసాను కుల భేదం లేకుండా, భూమిలేని ఒసి రైతులకు కూడా రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ కౌలు రైతు సంఘం నాయకులు ఎం.భాస్కర్ రావు మాట్లాడుతూ జూన్ 12వ తేదీ విజయవాడ నుండి ప్రకాశం బ్యారేజీ మీదుగా సిసిఎల్ఎ ఆఫీసుకు జరిగే రాయబారానికి గ్రామ కౌలు రైత ు లందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కె. రత్తయ్య, కె.విశ్వేశ్వం రావు, కె. కోటేశ్వరరావు, ఐ.నాగేశ్వర రావు పాల్గొన్నారు. కౌలు చట్టాన్ని మార్చాలని, భూ యజమాని సంతకం అనే నిబంధన కచ్చి తంగా తొలగించాలని కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం అధికారికి వినతి పత్రం సమర్పించారు.

పొనుగుపాడులో రైతు భరోసా అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతు సంఘం నాయకలు

రైతు భరోసా కేంద్రంలో వినతిపత్రం ఇస్తున్న కౌలు రైతు ఇబ్రహీం

తాగునీరు.. డ్రెయినేజీలోకి!

ప్రజాశక్తి-తాడేపల్లి

తాగునీరు చాలా విలువైంది. బొట్టుబొట్టు ఒడిసి పట్టుకోండి అంటూ ప్రభుత్వం పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తుంది. ఆచరణలో ఇందుకు భిన్నంగా పట్ట ణంలో పరిస్థితులు కనబడుతున్నాయి. పట్టణంలోని పద్మశాలీ బజారులో కొండపైకి వెళ్లే మెయిన్ పైపులైన్ పగులిచ్చింది. దీంతో తాగునీరు వృథాగా డ్రెయినేజీ నీటిలో కలుస్తుంది. అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించడంలేదు. దీంతో స్థానికులే పైపు పగిలిన చోట రబ్బరు తాడు చుట్టి కొంత లీకేజీని నిరోధించగలిగారు. అయినా అధిక శాతం మంచినీరు డ్రెయినేజీలో కలుస్తూనే ఉంది. దీని వల్ల పలువురికి సక్రమంగా మంచినీరు అందడంలేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేసి వృథాగా పోతున్న మంచినీటిని అరికట్టి నీరు అందే విధంగా చూడాలని స్థానికులు డిమాండ్ చేశారు. దీనిపై ఎఇ ప్రవీణ్‌కుమార్‌ను సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

పద్మశాలీ బజారులో కొండపైకి వెళ్లే మెయిన్ పైపులైన్‌కు పగులుతో వృథాగా పోతున్న తాగునీరు

పెద్దల ఉపాధి, బిడ్డల చదువు సాగాలి

ప్రజాశక్తి-పెదనందిపాడు

బడి ఈడు పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించినప్పుడే మన జీవితాలలో వారు వెలుగులు నింపుతారని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డిబిఆర్‌సి) రీజినల్ కో-ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అన్నారు. స్థానిక నాగులపాడు పంచాయతీలోని చెంచుకాలనీలో విద్యా చైతన్య ప్రచార ఉద్యమ సదస్సును మంగళవారం డి.బి.ఆర్.సి ఆధ్వర్యంలో నిర్వహించారు. సదస్సుకు డిబిఆర్‌సి ఏరియా కో- ఆర్డినేటర్ వి. భగవాన్ దాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చిన్నప్ప మాట్లాడుతూ గత ఏడాది జిల్లాలో డ్రాప్ అవుట్ అయిన వారిలో చెంచు కాలనీ విద్యార్థులు 80 మంది ఉండడం బాధాకరమన్నారు, జీవనోపాధిలో భాగంగా తల్లిదండ్రులు వలసలు వెళ్లే క్రమంలో బిడ్డలను కూడా బడి మాన్పించి తీసుకొని వెళుతుండటంతో వారికి భవిష్యత్తు లేకుండా పోతోందని అన్నారు. ప్రత్యామ్నాయ విధానాల ద్వారా అటు పెద్దల ఉపాధికి, ఇటు బిడ్డలు చదువుకి ఆటంకాలు ఏర్పడకుండా తగు ఆలోచన చేయాలని తల్లి దండ్రులను ఉద్దేశించి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుపుతున్న సంక్షేమ హాస్టళ్ళు, గురుకుల పాఠశాలలను ఉపయోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాగులపాడు సచివాలయం వెల్ఫేర్ సెక్రెటరీ ఎస్ జగజీవన్,ఎపిఎం ఎం సుబ్బారావు గ్రామ పెద్దలు పోలయ్య, వాలంటీర్ బాబు పాల్గొన్నారు.

నాగులపాడు ఎస్టీ కాలనీలో డిబిఆర్ సి సిబ్బంది నిర్వహిస్తున్న విద్యా చైతన్య ప్రచారం

సోషల్ మీడియా ఆక్టివిటీపై నోటీసులు

ప్రజాశక్తి తెనాలి

సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన యువకునికి బుధవారం పులివెందుల నుండి వచ్చిన పోలీసులు 41ఏ నోటీసులు జారీ చేశారు. స్థానిక ఐతనగర్కు చెందిన మదన్ టిడిపి కి అనుకూలంగా పనిచేస్తుంటాడు. ఇటీవల సీఎం జగన్ కుటుంబీకులకు సంబంధించి సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టాడంటూ నోటీసులు ఇచ్చేందుకు పోలీసులు రాగా, మదన్ అందు బాటులో లేడు. అతని తండ్రి మధుకు నోటీసులు ఇచ్చి పోలీసులు వెనతిరిగినట్లు టిడిపి నాయకురాలు జట్టు రేణుక తెలిపారు.

పెనుమాకలో టిడిపి కార్యకర్తల విస్తృత సమావేశం

ప్రజాశక్తి-తాడేపల్లి

రాష్ట్రంలో ప్రజలందరికీ సంక్షేమ కార్యక్రమాలు గతం నుంచి టిడిపి ద్వారానే అధికంగా అమలయ్యాయని టిడిపి మండల కార్యదర్శి కొల్లి శేషు చెప్పారు. పెనుమాకలో జరిగిన పార్టీ కార్యకర్తల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌టిఆర్ రాజకీయాల్లోకి వచ్చిన తరువాత ప్రజలకు రాజకీయాలు అర్థమయ్యాయని చెప్పారు. రూ.2కే కిలో బియ్యం పథకం 20 ఏళ్ల క్రితమే రాష్ట్రంలో అమలు చేసినట్లు చెప్పారు. మంగళగిరి నియోజకవర్గంలో ప్రస్తుతం 12 రకాల సంక్షేమ కార్యక్రమాలు అధికారంలో లేకపోయినా అమలు చేస్తున్నామన్నారు.సమావేశంలో తెలుగురైతు గుంటూరు పార్లమెంట్ అధ్యక్షులు కళ్లం రాజశేఖరరెడ్డి, పెనుమాక కార్యదర్శి వీరేంద్రనాథ్, పి.జానీఖాన్ పాల్గొన్నారు.

డీలిమిటేషన్ లో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

ఉత్తరభారతానికో తీరు దక్షిణాదికో తీరులా పార్లమెంట్ సీట్ల పంపకం ఉందని, డీలిమిటేషన్ లో దక్షణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని పొన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జక్కా శ్రీనివాస్ అన్నారు. 2026 డెలిమిటేషన్ ప్రక్రియలో సీట్లు పంపకాన్ని ఖండిస్తూ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జక్కా శ్రీనివాస్ మాట్లాడుతూ 2026 డెలిమిటేషన్ నాటికి లోక్ సభ లో సీట్లను పెంచాల్సి ఉండగా వాటిని 846 సీట్లుగా నిర్ధారించారని, వాటిలో దక్షిణాది రాష్ట్రాలకు అతి తక్కువ శాతం పెంచారని, దీనివల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. రాష్ట్రాలకతీతంగా, పార్టీలకతీతంగా వ్యతిరేకించాలని, అనివార్యమైతే ఉద్యమానికి సిద్ధమవ్వాలని అన్నారు.

ఐస్ క్రీమ్ బండి అందజేత

ప్రజాశక్తి-మంగళగిరి

స్థానిక 31వ వార్డుకు చెందిన బసవ నరసింహారావు పట్టణంలో గత 35 ఏళ్లుగా ఐస్ క్రీమ్ బండిపై వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు, తన బండి పూర్తిగా పాడై పోవడంతో తనకు ఐస్ క్రీమ్ బండిని అందజేయాలని టిడిపి నేత నారా లోకేశ్‌కు అర్జీ రూపంలో ఆయన విజ్ఞప్తి చేశారు. దీనిపై లోకేశ్ స్పందించారు. నరసింహారావుకు ఐస్‌క్రీమ్ బండిని టిడిపి నాయకులు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, వార్డు అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు షేక్ కరీముల్లా, తదితరులు ఉన్నారు

ఆర్‌విఆర్ అండ్ జెసిలో రేపు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో ఈనెల 9వ తేదీన నిర్వహిస్తున్న గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా భారత మాజీ ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు, నాగార్జునా యూనివర్సిటీ వీసీ పి.రాజశేఖర్ హాజరవుతున్నారని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో 2019-2023 సంవత్సరంలో 35వ బ్యాచ్‌కు చెందిన 1177 మంది విద్యార్థుల్లో డిగ్రీ పూర్తిచేసుకున్న 991 మంది డిగ్రీ పట్టాలు, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలు అందించనున్నట్లు చెప్పారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకూ 1146 మంది ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ కంపెనీలలో మంచి వేతనాలతో ఉద్యోగాలు సాధించారన్నారు.

85 ఏళ్ల వృద్ధురాలికి అరుదైన బ్రెయిన్ సర్జరీ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలోని సురక్ష హస్పిటల్‌లో సంకురాత్రిపాడుకు చెందిన 85 ఏళ్ళ వృద్ధురాలు మామిళ్ళపల్లి సామ్రాజ్యం అనే మహిళకు న్యూరో సర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు ఆధ్వర్యంలో అరుదైన బ్రెయిన్ సర్జరీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు మాట్లాడుతూ సదరు మహిళకు ట్రైజెమైనల్ న్యూరాల్జియా అనే వ్యాధి ఉన్నట్లు ధృవీకరించామని, ఈ వ్యాధి వలన విపరీతమైన దవడ నొప్పి వస్తుందని, కొన్ని ఏళ్ళ నుండి ఆమె ఈ బాధతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ వ్యాధి నివారణకై ఆమె ఎన్నో హస్పిటల్స్ తిరిగిన ప్రయోజనం కలగలేదని తెలిపారు. చివరగా ఆమె సురక్ష హస్పి టల్‌ను సందర్శించగా, వైద్య పరీక్షలు నిర్వహించి, మైక్రోస్కోప్‌తో మైక్రో వ్యాస్క్యులర్ డీ కంప్రెషన్ అనే సర్జరీని అధునాతన ఎక్యూప్‌మెంట్ సహాయంతో కేవలం చిన్న గాటుతో గంటలోపే సర్జరీని పూర్తిచేశామని డాక్టర్ లక్ష్మణ్ వెల్లడించారు. డాక్టర్ విడదల కృష్ణ శాంత్ నైపుణ్యం చూపించి ఆమెకు మత్తు ఇవ్వడంతో కష్టమైన ఆపరేషన్‌ని సునాయాసంగా, విజయవంతంగా నిర్వహించామని తెలియ జేశారు. శస్త్ర చికిత్సలకు వయసు అడ్డుకాదని, ఈ ఆధునిక కాలంలో అసాధ్యం కాని ఆపరేషన్లను నూతన పద్ధతులతో సుసాధ్యం చేయవచ్చని డాక్టర్ లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణరావును వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ ప్రత్యేకంగా అభినందించారు.

శస్త్ర చికిత్స చేసిన వృద్ధురాలితో వైద్యులు

సిడిఎంఎ, నగర కమిషనర్‌ను కలిసిన మేయర్

ప్రజాశక్తి-గుంటూరు :నగర కమిషనర్, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పి.కోటేశ్వరరావును నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి గుంటూరు నగరంలో నిర్వహిస్తున్న, నిర్వహించాల్సిన వివిధ అభివద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధులు, నగర పాలక సంస్థ వివిధ విభాగాల అధికారుల సమన్వయంతో గుంటూరు నగరంలో అభివద్ధి పనులు ఎంతో వేగవంతంగా నిర్వహిస్తున్నా మన్నారు. ముఖ్యంగా ఆర్‌యుబిలు, ఆర్‌ఓబిల నిర్మాణం, పివికె నాయుడు మార్కెట్ వంటి పెండింగ్ పనులపై చర్చించారు.

కోటేశ్వరరావుకు పూలబొకే అందచేస్తున్న మేయర్

ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్‌పై

వివిఐటిలో సాంకేతిక ప్రదర్శన

ప్రజాశక్తి-తెనాలి:

వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాల నంబూరులో బుధవారం కళాశాలకు చెందిన ఐఈఈఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ సాంకేతిక ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శ నలో వివిద కళాశాలలకు చెందిన 53 విద్యార్థి బృందాలు పాల్గొన్నాయి, వారు తయారు చేసిన సాంకేతిక రూపాలను ప్రదర్శించారు. ప్రదర్శనలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటి) నమూనాలు స్మార్ట్ అగ్రికల్చర్, పొల్యూషన్, ట్రాఫిక్ నియంత్రణ, యాంటి కోవిడ్ కిట్స్, అగ్రి బోట్‌లు విశేషంగా ఆకట్టుకున్నాయి. సాంకేతిక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థి బృందాలను ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లిఖార్జునరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచం సాంకేతికతను కోరుకుంటుందని, నిజ జీవితంలో అవసరమైన వివిధ రంగాల్లో ఆవిష్కృతమౌతున్న సాంకేతికతను స్వాగతిస్తుందన్నారు. సమాచార వ్యవస్థలో ఐఓటి టెక్నాలజీ పాత్ర కీలకంగా మారిందన్నారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎన్.కుమారస్వామి, సిఐసి విభాగాధిపతి డాక్టర్ ఎంఆర్ఎన్ ఠాగూర్, సిఎస్ఓ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ సురేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రదర్శనలో పాల్గొన్న వివిధ కళాశాలల విద్యార్థులు


నేడు గుంటూరుకు మున్సిపల్ కార్మికుల జాతా

ప్రజాశక్తి-గుంటూరు

మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, 010 పద్దు క్రింద జీతాలు చెల్లించాలని నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికుల రాష్ట్ర జాతా నేడు గుంటూరు నగరానికి వస్తున్నందున ఉదయం 9 గంటలకు జిఎంసి ప్రధాన కార్యాలయం వద్ద సభ నిర్వహిస్తున్నట్లు ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు తెలిపారు. బుధవారం స్థానిక బ్రాడీపేటలోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉండి వైసిపి అధికారంలోకి రాగానే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పారని, అధికారంలోకి వచ్చిన తరువాత పర్మినెంట్ ఊసే లేకుండా చేశారని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టినప్పటికీ దాన్ని కూడా తుంగలో తొక్కారన్నారు. పర్మినెంట్ ఉద్యోగులు, కార్మికులకు సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు నెరవేర్చట్లేదన్నారు. సిఎం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలో జాతా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జాతాలో కార్మికులు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని కోరారు.

మాట్లాడుతున్న ముత్యాలరావు

ఈ- ఆటోలను పరిశీలించిన కమిషనర్, మేయర్

ప్రజాశక్తి-గుంటూరు

క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఇంటింటి చెత్త సేకరణకు ఈ-ఆటోలను రాష్ట్ర ముఖ్యమంత్రి గురువారం ఉదయం ప్రారంభించను న్నారని, గుంటూరు నగర పాలక సంస్థకు కేటాయించిన ఆటోలను కూడా ప్రారంభోత్సవానికి తీసుకెళ్లాలని సిడియంఏ, నగర పాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) పి.కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు, ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌తో కలిసి ఈ-ఆటోల ప్రారంభోత్సవానికి సంబంధించి ప్రభుత్వం గుంటూరు నగర పాలక సంస్థకు కేటాయించిన ఆటోలను వెహికల్ షెడ్‌లో అధికారు లతో పరిశీలించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంటింటి చెత్తను తడి, పొడిగా వేరుగా సేకరించటానికి 516 ఈ-ఆటోలను ప్రభుత్వం అందించిందని, వీటిని సిఎం గురువారం ఉదయం 9 గంటలకు వారి క్యాంప్ కార్యాలయం వద్ద ప్రారంభిస్తారని తెలిపారు. అందులో భాగంగా గుంటూరు నగరానికి 220 ఆటోలను అందించడం జరిగిందన్నారు. సదరు ఆటోలు నగరంలోని 206 వార్డు సచివాలయాల వారిగా ఇంటింటి చెత్త సేకరణ చేస్తాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పెద్ది రోజ, ఎస్.ఈ. భాస్కర్, ఈ.ఈ. కొండారెడ్డి, కార్పొరేటర్ కాంద్రుకుంట గురవయ్య, అధికారులు ఈ-ఆటోల తయారీ కంపెనీ కైనెటిక్ గ్రీన్ ప్రతినిధులు, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్, మేయర్

ప్రజలు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి : ఎమ్మెల్సీ కెఎస్

ప్రజాశక్తి-గుంటూరు

శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జన విజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరాలని జిల్లా గౌరవాధ్యక్షులు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. బుధవారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన జెవివి జిల్లా కార్యవర్గ సమావేశం సందర్భంగా సభ్యత్వ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ శాస్త్ర ప్రచార ఉద్యమంలో 35 సంవత్సరాల ప్రస్తానం గల జెవివి ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్, స్వావలంబన కోసం సైన్స్ అనే నినాదంతో అనేక కార్యక్రమాలు చేస్తుందన్నారు. జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎ.సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ నేటికీ సమాజంలో విద్యావంతులు మూఢనమ్మకాలను నమ్ముతున్నారని, ప్రతి ఒక్కరూ శాస్త్రీయంగా ఆలోచించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.కె.అహ్మద్ హుస్సేన్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్, జి.వెంకటరావు, టి.జాన్‌బాబు, యం.ఉదయభాస్కర్, ఎండి. అక్బర్, ఇ.అనిల్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, జెవివి నాయకులు

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో జగనన్నకు చెబుదాం అర్జీలను ప్రత్యేక శ్రద్ధ తీసుకొని దరఖాస్తుదారులు సంతృప్తి చెందేలా సక్రమంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరం నుంచి జెసి జి.రాజ కుమారి, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం అర్జీలు అందిన 24 గంటల్లోనే దరఖాస్తుదారులతో నేరుగా మాట్లాడి సాధ్యమైనంత వరకు వారి సమస్యలకు మెరుగైన పరిష్కారం అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పిఎం ఆవాస్ యోజన గ్రామీణ క్రింద మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించి పూర్తి చేసేలా ఎంపీడీవోలు, తహసీల్దారులు హౌసింగ్ అధికారులతో సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవాలని అన్నారు. పేదలందరికీ ఇళ్ల పథకం లేఔట్‌లోను ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం చేసి, నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించా లన్నారు. జిల్లాలోని లేఔట్ల వద్ద ఆర్చీల నిర్మాణం పనులు వెంటనే ప్రారంభించా లన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ కే. చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం.వెంకట శివరామి రెడ్డి, హౌసింగ్ ఈఈ శంకరరావు , జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు, పంచాయితీ రాజ్ ఎస్.ఈ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్